# ప్రవాహం

నిద్ర లేస్తుంటేనే వాణికి గుర్తు వచ్చింది. 'ఈవేళ శివరామ్ భోజనానికి వస్తాడు. ఈ వేళ దీపావళి.'

లోపల దేవుడి గదిలోనించి బామ్మ కంఠం రాగయుక్తంగా శ్రావ్యంగా వినిపిస్తూంది, ప్రతిరోజూలాగే.

ఆ రాగం, ఉచ్చారణ వాణికి ఊరట కలిగిస్తుంది. ఆలోచనా తరంగాలతో నిండిన మనస్సుకి, చుట్టూ ఉండే మనుష్య ప్రపంచానికి దూరంగా తీసుకువెళ్లి ఒక ప్రశాంత సౌందర్యాన్ని, నిశ్చల తత్వాన్ని రుచి చూపిస్తూంది.

చుట్టూ ప్రపంచం!

నాన్నా, అమ్మ, బామ్మ,రవి, భారతి, బాబి, పాప— కుటుంబం. అన్నయ్య రవి స్నేహితుడు ప్రసాద్, తరువాత శివరామ్, తన స్నేహితురాలు పద్మ, ఇంకా ఇరుగు పొరుగు— ఇదంతా బయటి ప్రపంచం. అంతా కలిసి ఒక రంగుల రాట్నం. అందరూ హడావిడిగా, గిరగరా తిరుగుతున్నట్లు కనిపిస్తారు. కోరికలు, ఆశయాలు, గమ్యాలు వాళ్లని అట్లా తిప్పుతాయి. ప్రవాహంలోకి లాగుతాయి.

'నేను రంగుల రాట్నం చూస్తూ నిలబడిన ఒక ప్రేక్షకురాలిని. అంతే! అది ఎక్కి తిరగలేను' అనుకుంది వాణి.

శివరామ్ మాత్రం ఒక ప్రత్యేక వ్యక్తి అనిపిస్తాడు. అతడు నాన్నగారికి దగ్గిర చుట్టం. ఉద్యోగంకోసం ఈ ఊళ్లో ఉన్నాడు. మూడేళ్ల నించి అతడిని చూస్తున్నా, అతడిపై అభిప్రాయంలో మార్పు లేదు. అతడిని చూస్తుంటే లతలాగ అల్లుకుపోవాలని, కరిగి సెలయేరై అతడి పాదాలు తడిపెయ్యాలని అనిపిస్తుంది.

ఊహుం.... మనసు అట్లాగ ద్రవించ కూడదు.

ఈ వేళ ఎందుకో లేస్తూనే గుర్తు వచ్చాడు... 'శివరామ్...' పక్కమీద నుంచి లేచింది వాణి.

ముఖం కడుక్కుని వంటింట్లోకి వెళ్ళి, తల్లి అందించిన కాఫీ తాగుతూంది. రవి కూడా అప్పుడే కాఫీ తాగుతున్నాడు. బామ్మ పాడుతూంది.

''బాలస్తావత్ క్రీడాసక్త
స్తరుణస్తావ త్తరుణీ సక్తః
వృద్ధస్తావ చ్చింతాసక్తః
పరే బ్రహ్మణి కోపిన సక్తః''

పొయ్యిమీద పాలు పొంగాయి. అమ్మ విసుక్కుంటే బామ్మ నవ్వింది.

పాలు పొంగితే బామ్మ చలించటంలేదు అమ్మలాగ.

''బామ్మా! నువ్వు పాడేది ఏమిటి?'' అని అడిగింది పాప.

''బామ్మ అష్టపదులు పాడుతూంది'' అన్నాడు రవి అన్నయ్య.

వాణికి నవ్వు వచ్చింది.

''బాగుంది, నాయనా, తెలివి!'' అంది బామ్మ.

మరేమిటి! జావళీలా?''

''నాకేం జావళీలురా! చదవేస్తే ఉన్న మతి పోయిందని! ఏం చదువులో మీవి! నేను పాడుతున్నది భజగోవిందమ్..''

''భజగోవిందమా! ఐతే, బామ్మా! నీకు గీత వచ్చా?''

''భజగోవిందం వస్తే గీత అంతా వచ్చినట్లేరా..''

''అది ఎవరు వ్రాశారు, బామ్మా?''

''ఎవరు రాస్తే ఏంరా! మంచి మాట ఎవరు చెబితే నేం? అవి చెవులలో పడితే చాలు, మళ్ళీ మన నోటితో ఉచ్చరిస్తే చాలు జన్మ ధన్య మవుతుంది'' అంది బామ్మ.

''శంకరాచార్యులు!'' అంది వాణి.

''నీకు వచ్చునుటే... అవునులే... నువ్వు నాన్నగారి షెల్ఫ్‌లో పుస్తకాలన్నీ చదువుతావు...'' అని అడిగాడు రవి.

''ఊరికే తెలుసంతే ...నాకు రాదు'' అంది వాణి.

''బామ్మా! రేపటి నుంచి నువ్వు నాకు భజగోవిందమ్ నేర్పించాలి. ఇప్పుడు మన వేదాలు, వేదాంతాలు అన్నీ అమెరికాలో లేటెస్టు ఫాషన్. వాళ్ళే నేర్చుకుంటుంటే మనకి రాకపోవటం సిగ్గు, చిన్నతనం...''

''అలాగే నేర్పుతాను. దానికేం భాగ్యం'' అంది బామ్మ.

వాణికి నవ్వు వచ్చింది.

'రేపీపాటికి భజగోవిందమున్న మాటే గుర్తుండదు వాడికి' అనుకుంది.

రవి వాణివైపు తిరిగి, ''రేపటి నుంచి కాలేజీలో స్వామీజీ ఉపన్యాసా లున్నాయి. ఆయన ఇంగ్లీషులో మాట్లాడతారు. కలెక్టరు కూడా వస్తాడట. బ్రహ్మాండంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. నువ్వు కూడా వస్తావా? ... ఎట్లాగ వస్తావులే...'' అంటూ వెళ్ళిపోయాడు.

స్వామీజీ ఉపన్యాసాలను గురించి వింది వాణి. పద్మ చెప్పింది. పద్మ ఎక్కడ, ఏ సమాచారం విన్నా వాణికి చెపుతుంది.

పద్మ తన మనసులో మనసు. అందరూ జాలి పడతారే కానీ ఆత్మీయత, స్నేహం తెలిసింది, పంచుకునేది పద్మ ఒక్కతే!

'వస్తావా? ఎట్లాగ వస్తావులే..' అనేసి వెళ్ళిపోయాడు....వాడు అన్నయ్య!

'ఔను, ఎట్లాగ వెడతాను! అదీ నిజమే' అనుకుంది వాణి.

బయటికి వెడితే సానుభూతి చూపించే కంటే, వెనకగా పరిహసించే వాళ్లే ఎక్కువ. ఆ సానుభూతి కూడా భరించటం కష్టమే. ఓణీలు వేసుకోవటం ఆరంభించాక అంతకు ముందర లేని ఆలోచన, ఆవేదన మనసులో ప్రవేశించాయి. నలుగురిలోకి వెళ్లట మంటేనే ఆందోళన , ఆవేదన!

అందుకే కాబోలు నాన్న ''ఎట్లాగో స్కూలు చదువు అయింది. నువ్వు బాగా చదువుకుంటున్నావు; ఇంకా చదువుకో. కానీ ఇంట్లోనే ఉండి ప్రైవేటుగా చదువు'' అన్నారు.

అదీ బాగానే ఉంది. చదువే కాదు, ఇంకా ఎన్నెన్నో పుస్తకాలే కాదు... మనసులు, మనుషుల్ని కూడా చదవటం నేర్చుకుంటూంది.

'మనుషులు...కాలంతో కొట్టుకుపోతారు. ఆ క్షణంలో ఉన్న ఆవేశంలో పడి కొట్టుకుపోతారు. మరుక్షణంలో దాన్ని మరిచిపోతారు. కొత్తది రాగానే పాతదాన్ని వదిలేస్తారు. అట్లాగ ప్రవాహంలో పడి కొట్టుకుపోని వాళ్లం బామ్మ, నేనూ!

ఔను...అన్నీ అనుభవించిన బామ్మ.

ఏమీ అనుభవించ....లేని నేను!

మిగతావాళ్లందరికీ వాళ్ల కష్టసుఖాలలో ఈదులాడటం తప్ప వేరే ఆలోచన, విశ్వసంసారం గురించిన ఆలోచన రాదు. అసలు వాళ్లకి అట్లాగ ఆలోచించ వలసిన

అవసరమూ, తీరికా రెండూ లేవు! నిజంగా అంత కంటె ఏం కావాలి!'

అప్పుడే వస్తున్న ఎండలో వరండాలో నిలబడింది వాణి. తలంటి పోసుకుని, జుట్టు ఆరబెట్టుకుంటున్న భారతి దగ్గిరగా వచ్చి, ''నువ్వు కూడా వెళ్ళి త్వరగా తలంటి పోసుకురా. నీళ్ళు కాగాయి. సుబ్బులు కుంకుడు కాయలు నానబెట్టింది. నువ్వు వచ్చాక కొత్త చీరలు కట్టుకుందాం'' అంది.

వాణి స్నానానికి వెళ్లింది.

'భారతికి పండగ వస్తే ఎంత సంతోషం! నేను తలంటుకోకపోతే అమ్మ కోప్పడుతుంది. భారతి కోసం నేను కొత్త చీర కట్టుకోవాలి.' స్నానాల గదిలో కూడా వాణి ఆలోచనలు ఆగటంలేదు.

జుట్టు నురగ వచ్చేటట్టు రుద్దుకున్నాక, సుబ్బులు తలమీద నీళ్ళు పోస్తూంది.

'ఔను, మనుషులు ప్రవాహంలో కొట్టుకుపోతారు. ఆ క్షణంలో ఏ ఆవేశం ఉంటే దానిలో బ్రతుకుతారు.

అప్పుడు...ఎలక్షన్లు వచ్చినప్పుడు...గంగాధరాన్ని తిట్టిపోశారు. రామచంద్రరావంత మంచివాడు లేడన్నారు. ఆయన జీవిత చరిత్ర అంతా చెప్పాడు అన్నయ్య. ఆ ఎలక్షన్లయిన మూడవ రోజు నుంచి మళ్లీ అతడి పేరు వినలేదు.

అప్పుడు...స్టీలు ఫ్యాక్టరీ కావాలని, హిందీ వద్దు అని ఆందోళన చేసినప్పుడు అంతే! రైళ్ళు ఆపి, బస్సులు తగలబెట్టి అల్లరి చేశారు. హిందీ ఎందుకు వద్దు? అని ప్రశ్నిస్తే అన్నయ్య, ప్రసాద్ కూడా సరియైన సమాధానం చెప్పలేదు. మళ్లీ ఆ ప్రసక్తి రాలేదు. అది ఆవేశం. అంతే. ఆశయం కాదు. రేపు స్వామీజీ వస్తే ఆ వారం రోజులూ వాలంటీర్లు అవుతారు. వేదాంతులైపోయినట్లు భావిస్తారు. వేదాలని, హిందూ దేశాన్ని పునరుద్ధరించటానికి కంకణం కట్టుకున్నట్లు తిరుగుతారు, మాట్లాడుతారు. స్వామీజీ అటు వెళ్లగానే... ఆ సాయంత్రం రమా మహల్‌లో గండికోట రహస్యానికి ...'

''గంగాళంలో నీళ్లన్నీ అయిపోయినాయి. ఇంకా లెగరేటమ్మగారూ? మీ రెప్పుడూ అంతే. ఒంటిమీద ఊసుండదు'' అని కిలకిలా నవ్వింది సుబ్బులు, తువ్వాలు, చీర అందిస్తూ.

''లేస్తున్నానే!'' అంది వాణి నవ్వుతూ.

సుబ్బులు చెయ్యి అందించింది తలకి తువ్వాలు చుడుతూ, ''బంగారు బొమ్మలాగ ఉంటారు. ఆ దేవుడు...'' అంది గొంతులో జాలి ఉట్టిపడుతూ సుబ్బులు.

''ఊరుకోవే....'' కసిరినట్లు అంది వాణి.

వాణి, భారతి కొత్త చీరలు కట్టుకుని వరండాలో నిల్చున్నారు. వాణి జుట్టు ఆరబెట్టుకుంటూంది. భారతి రెండు జడలు వేసుకుంది. చెవులకి రింగులు పెట్టుకుంది. మాట మాటకీ వీధి గేటు వైపు చూస్తున్నాయి భారతి కళ్లు. వాణి నవ్వుకుంది.

'శివరామ్ కోసం! ఔను. అక్క ప్రేమావేశంలో ఉంది. శివరామ్‌తో పెళ్లి అయ్యేదాకా ఆ ఆవేశంలో పడి కొట్టుకుపోతూ ఉంటుంది.'

''అక్కా, శివరామ్ ఈవేళ భోజనానికి వస్తాడా?'' అని అడిగింది తెలియనట్లు వాణి

''అమ్మ మరీ మరీ చెప్పింది. నాన్న గారితో వస్తానని చెప్పాడట. వస్తాడు'' అంది భారతి.

భారతి కళ్లలో సిగ్గు, బుగ్గల్లో ఎరుపు కనిపించాయి వాణికి.

''భారతీ, కాస్త ఏలకులు కొట్టి ఇవ్వరాదటే'' అని పిలిచింది తల్లి.

భారతి అయిష్టంగా వంటగది వైపు వెళ్లింది.

పోస్టుమాన్ వచ్చాడు. వాణి లోపలికి వెళ్లి తల్లికి చదివి వినిపించింది ఉత్తరం. పెద్దక్కయ్యకి అయిదవ నెలట! అదీ సారాంశం....

''జానకికి అయిదవ నెలట...''తల్లి సంతోషంగా బామ్మకి, పక్కింటావిడకి చెప్పింది. వాణి వరండాలోకి వచ్చి కుర్చీలో కూర్చుంది మళ్లీ. మొన్ననే ఏడాది అవుతూంది, అక్కయ్య పురుడు పోసుకువెళ్లింది. డాక్టర్లూ, మందులూ, బారసాలా, భోజనాలూ....అన్నీ అయ్యాయి. మళ్లీ మొదలు.... అమ్మకి కష్టం అనిపించదా?

నాన్నా అంతే! డబ్బు తేవటం, సర్దటం, అందరి అవసరాలూ తీర్చటం— అదే జీవితం. విసుగు అనిపించదా? మమతానుబంధం! పిల్లల్ని పెద్దవాళ్లని చెయ్యటంలోనే వాళ్లకి తృప్తి ఉంది కాబోలు!

తండ్రి, శివరామ్ ఒక సారే వచ్చారు. తండ్రి లోపలికి వెళ్లాడు. శివరామ్ వాణికి దగ్గరగా ఉన్న కుర్చీలో కూర్చున్నాడు.

''ఇందాకటి నుంచి భారతి నీకోసం ఎదురుచూస్తూంది.'' కొంటెగా నవ్వుతూ అంది వాణి.

''మరి నువ్వేం చేస్తున్నావు!'' అన్నాడు శివరామ్

''నేను ఏమి చెయ్యను'' అంది.

''మనిషి ఏమి చెయ్యకుండా ఉండలేడు'' అన్నాడు.

''అయితే ఊహిస్తున్నాను కాబోలు!''

''ఏమని!''

''దీపావళి నాటి రాత్రి ఎన్ని దీపాలు వెలుగుతాయని!''

''అర్థంలేని ఆలోచన...''

''నీ అంత తెలివైనదాన్ని కాదు.''

''నీకు తెలివి లేదని ఎవరనగలరు?''

''బ్రతకటానికి అది ఒకటే చాలదు'' అంది వాణి.

ఏదో అనబోయాడు శివరామ్. రవి లోపలికి వచ్చాడు.

''అమ్మ భోజనానికి రమ్మంటూంది.'' భారతి వచ్చి చెప్పింది.

వాణి భారతిని, శివరామ్‌ని చూస్తూంది.

భారతి అలవోకగా నిలబడి ఉంది. భారతి కళ్లలో కాంతి ఉంది. చూపులు పాశంతో బంధిస్తున్నంత ఆకర్షవంతంగా ఉన్నాయి.

''వస్తున్నా పద'' అన్నాడు శివరామ్ కుర్చీలోనుంచి లేచి.

తన చూపులు గిరుక్కున మరల్చుకుని తను ముందు దారితీసింది భారతి.

'భారతి అదృష్టవంతురాలు. బి.ఎ. పాసవకపోయినా, సంగీతం అంటే శ్రద్ధ లేకపోయినా....అది అదృష్టవంతురాలు. అందమైన మనస్సు, వయస్సు ఉండటమే అదృష్టం! ఏ వయసు కాముచ్చట అందం. ప్రవాహంలో పడి కొట్టుకుపోవటమే ఆనందం...'

శివరామ్ వెనకాల లోపలికి నడిచింది వాణి. అందరూ భోజనాలకి కూర్చున్నారు. తల్లి వడ్డిస్తూంటే, బొమ్మ నేతి గిన్నె పుచ్చుకుంది. పులిహోర, పరమాన్నం, ఆవడలతో భోజనం అయింది. భోజనం రుచికరంగా, షడ్రసోపేతంగా ముగింపుకు వస్తూంటే, తండ్రి ఒక మాట అన్నాడు శివరామ్‌తో.

''భారతికి పెళ్లి చెయ్యాలనుకుంటున్నాము. మీ నాన్నగారికి ఉత్తరం వ్రాద్దామనుకుంటున్నాను.''

శివరామ్ ఏమీ మాట్లాడలదు.

''ఏమంటావ్?'' అన్నారాయన మళ్లీ.

''వ్రాయండి'' అన్నాడు శివరామ్ చిరునవ్వుతో.

'అంత అందంగా ఎట్లాగ నవ్వ గలడు!' అనుకుంది వాణి.

''శివరామ్‌కి పక్క వెయ్యి, భారతీ!'' తల్లి ఆజ్ఞాపించింది.

తమలపాకులు అమర్చిన పళ్లెం తండ్రికి అందించి వెళ్లింది భారతి.

భుక్తాయాసం తీరేలాగ పడుకున్నారు కొంతసేపు.

లేచి, కాఫీ తాగేటప్పటికి బామ్మ ప్రమిదల నిండా వత్తులు వేసి పెట్టింది. దీపాల వేళయింది.

తిరగటానికి వెళ్లిన రవి ప్రసాద్‌ని కూడా తీసుకువచ్చాడు.

తండ్రి, శివరామ్ అంతా మాట్లాడుకుంటున్నారు. నాగులచవితి నాడు కాల్చటానికి కొన్ని టపాకాయలు దాచి, మిగతా వాటిని వరండాలో తెచ్చిపెట్టారు బాబి, పాప.

భారతి, వాణి ప్రమిదలలో నూనె పోసి దీపాలు వెలిగించారు.

''జాగ్రత్త. దూరంగా ఉండు, వాణీ!'' అని అమ్మ హెచ్చరించింది.

ఒక్కొక్క దీపం వెలిగిస్తూ, భారతి శివరామ్ వైపు చూస్తూంది.

భారతి హృదయంలో ఎన్ని దీపాలు వెలుగుతున్నాయో! ఎన్ని వెలిగించు కుందో! శివరామ్‌ని చూస్తూంటే ఆ కళ్లు కాంతితో వెలిగిపోతున్నాయి.

మనిషికి ఏంకావాలి! హృదయంతో హృదయం పెనవేసుకుపోగల అనురాగం... తనను గుండెలోపల దాచేసుకో గల పురుషుడు! ప్రాణంలాగా రక్షించుకో గల పురుషుడు! దాని కోసం జీవితాంతం ఆరాట పడుతూ తపిస్తూనే ఉంటుంది. స్త్రీ హృదయం.

భారతి అతణ్ణే శివరామ్‌లో వెతుక్కుంటూంది.

శివరామ్ భారతిని గుండెలో దాచుకోగలడు.

భారతి శివరామ్‌ని లతలాగ అల్లుకుపోతుంది.

భారతి హృదయంనిండా దీపాలు వెలుగుతాయి.

తెచ్చిన టపాకాయలు అట్టహాసంతో కాలుస్తున్నారు రవి, ప్రసాద్.

భారతి దగ్గిర ఉండి బాబిచేత, పాపచేత మతాబులు కాల్పిస్తూంది.

వాణి మెట్లు ఎక్కి డాబా మీదికి వెళ్లింది. అక్కడ నిశ్శబ్దంగా ఉంది. ఆ నిశ్శబ్దానికి చుట్టూ లోకం ఉంది.

అందరి ఇళ్లలోనూ దీపాలు అమర్చి ఉన్నాయి.

కాకర పువ్వొత్తులు, మతాబులు, చిచ్చుబుడ్లు వెలుగుతున్నాయి. వింత వింత శబ్దాలు, మోతలు. చీకటి వెలుగుల నీడలు...

పైన ఆకాశంలో చుక్కలు భూమి మీద దీపావళి చూస్తున్నాయి.

''వాణీ!''

వెనక్కి తిరిగి చూసింది వాణి.

''నువ్వా!'' అంది.

శివరామ్ వాణికి దగ్గిరగా వచ్చి నిలబడ్డాడు.

''ఎందుకు వచ్చావు?'' అడిగింది.

''అదే నేనూ అడుగుతున్నాను'' అన్నాడు శివరామ్

ఆ కంఠం మామూలుగా వినిపించ లేదు వాణికి.

అది తనలో దాచుకున్న శివరామ్ కంఠంలాగ ఉంది. వాణి నవ్వింది.

''నాకు వెలుతురికి దూరంగా ఉండాలని ఉంటుంది. ఒంటరిగా ఉండాలని ఉంటుంది....నిజం ఒప్పుకుంటే...''

''నిన్ను అట్లాగ వదలటం నాక్ష్టం లేదు, వాణీ. అందుకే నేను వచ్చాను.''

''నువ్వు వెళ్లిపో...నాకు ఇక్కడే బాగుంది'' అంది వాణి.

''దాచటం ఏం లాభం, వాణీ! మీనాన్నగారి మాటలు విన్నావు కదూ? నేను నిన్ను పెళ్లి చేసుకుంటాను'' అన్నాడు శివరామ్.

''నన్నా!'' వాణి నవ్వింది పరిహాసంగా.

''ఊఁ నిన్నే.''

''నీకు తెలుసు ..నేను అందరి లాంటి దాన్ని కాదు.''

''ఔను. నేనూ అందరిలాంటి వాణ్ణి కాదనుకో...''

''అది తెలుస్తూనే ఉంది. భారతిని కాదని నన్ను చేసుకుంటానంటే....''

''పరిహాసం కాదు''

''పరిహాసమే చేస్తున్నావు. అవమానిస్తున్నావు నన్ను. లేకపోతే అన్నీ ఉన్న భారతిని కాదని కుంటిదాన్ని నన్ను...''

క్రచెస్‌లో (చేతిక్రింది కఱ్ఱ) ఒకటి పడిపోయింది. వాణి మొహాన్ని చేతుల్లో దాచుకుంది.

వాణి భుజం మీద చేయి వేసి, ''వాణీ, నన్ను నమ్ము'' అన్నాడు శివరామ్.

వాణి కళ్లు తెరవలేదు. దీర్ఘమైన నిట్టూర్పు వెలువడింది.

శివరామ్ తన కళ్లలోకి చూసి, ''నన్ను నమ్ము, వాణీ'' అంటున్నాడు.

'నమ్ముతాను. నిన్ను నమ్ముతాను' అంటూ ఆక్రోశిస్తోంది మనసు.

ఎంత మధురంగా ఉంది అనుభవం! కరిగి సెలయేరు అవుతుంది మనసు.

'శివరామ్ ఎన్ని విధాలుగా అర్థం చేసుకున్నా, అతడి చూపుల్లో ఎన్ని సందేశాలు వదవగలిగినా ఇంత పని చేస్తాడని అనుకోలేదు. ఇప్పుడు శివరామ్ వచ్చి తన జీవితంలోకి ఆహ్వానిస్తున్నాడు. ప్రవాహంలోకి లాగేస్తున్నాడు.... గిరగిర తిరిగే

రంగుల రాట్నం మీద కూర్చోపెడుతున్నాడు.

'నేను కూడా ప్రవాహంలోకి జారిపోతున్నానా! జారిపోతానా?' కళ్లకి చేతులు అడ్డం తీసింది వాణి.

శివరామ్ అట్లాగే తన ముఖంలోకి, కళ్లలోకి చూస్తున్నాడు.

ఈ క్షణం మళ్లీ రాదు. తన జన్మ అంతటిలో మళ్లీ రాదు.

పైన నింగిలో నక్షత్రాలు....చట్టూ చల్లగాలి...మధ్య తనూ, శివరామ్. మళ్లీ ఎప్పుడూ ఇట్లాగ ఉండరు.

''వాణీ, ఊఁ అను'' అన్నాడు శివరామ్, వాణి భుజం కుదిపి.

వాణి తన చూపులు మరల్చుకుంది. అతడికి ప్రతిముఖంగా తిరిగి నిలబడింది.

''ఊఁ అను.'' శివరామ్ కంఠం.

''ఉహుఁ'' అని, వాణి శివరామ్ వైపు తిరిగింది.

''అసలు నేను పెళ్లి చేసుకోను...'' అంది.

''ఎందుకని! దురదృష్టవశాత్తు లోపం ఏర్పడినంత మాత్రాన జీవితానికి ఎందుకు దూరం కావాలి! ఆ మనిషికి మాత్రం కోర్కెలూ, మనసూ ఉండవా?''

''నామీద సానుభూతి!''

''ఏమైనా అను. కొందరు అన్నీ ఉన్న సుఖాల్ని కోరుకుంటారు. నేను నిన్ను కోరుకుంటున్నాను. అందులోనే నా తృప్తి ఉంటుంది. భారతిని ఎవరైనా చేసుకుంటారు. నిన్ను చేసుకుంటేనే నాకు తృప్తి.''

''కానీ, నేను పెళ్లి చేసుకోను...'' నవ్వింది వాణి.

''ఎందుకని?

''ఎందుకని? చిన్నప్పటినుంచీ అంతే నేను. నాకు పెళ్లి అంటేే అసహ్యం. మగవాళ్లంటేే అసహ్యం. స్త్రీలని స్వార్థానికి వాడుకుంటారు. ప్రేమ అని పేరు పెడతారు. అసలు ప్రేమ అనేది లేదు. నీది సానుభూతి. అది నాకు అక్కరలేదు.''

శివరామ్ వెనక్కి తిరిగి నిశ్శబ్దంగా మెట్లు దిగి వెళ్లిపోయాడు.

పిట్ట గోడమీద తల వాల్చి వెక్కి వెక్కి ఏడ్చింది వాణి.

మూడు నిమిషాలు గడిచాయి. ఏడుపు ఆగింది.

ప్రవాహంలోంచి ఒడ్డుకు వచ్చింది మనసు.

రెండు కర్రలనూ చేతులకింద ఆన్చుకుని నింగిని చూస్తూ నిటారుగా నిలబడింది వాణి.

* * * *